# సీతాకోకచిలుక

వంతెన మీద నిల్చున్నాను. క్రింద మహాగంగ నిండుగా, నింపాదిగా ప్రవహిస్తున్నది.

ఎక్కడ నుండో, ఎక్కడికో, ఎందుకో.

ఈ వంతెనమీద నిల్చుని దాన్ని అర్థం చేసుకోవడం సాధ్యమా ?

దానితో ప్రవహించవచ్చును గాని, దాన్ని అర్థం చేసుకోవడం ఏమిటి ? అర్థం చేసుకోవడం అనేది అర్థంలేని పిచ్చిమాట. చచ్చుమాట !

ఒక స్థితిలో దానితో ప్రవహించవచ్చు. మరోస్థితిలో వంతెనమీద నిల్చుని దాన్ని చూడవచ్చు. లెండూ సత్యమే. కాని యీ రెండు స్థితులకీ మధ్యన సంబంధం వున్నదా ?

ఎన్నో ఊహలు నాలో చిన్న అలల్లాగ అకారణంగా పుట్టి సోమరిగా తిరిగి వ్యర్థంగా సమసిపోతున్నాయి.

పాతికేళ్ళ క్రితం నేను అయిదేళ్ళ పిల్లవాడిని. కృష్ణుడిని. ఎవరూ అర్థం చేసుకో ప్రయత్నించని చిన్న వ్యక్తిని.

ఇక్కడినుండీ వెనక్కి తిరిగి చూసుకుంటే అప్పటి నేను ఒక బుద్ధి తెలియని పసివాణ్ణి. ఈ జీవన సంఘర్షణలో నా ఉనికికి ఆధారం, ఆలంబన అయిన అమ్మ నన్ను ఓర్పుగా లాలించి సేదదేర్చే ప్రేమమూర్తి. నాన్న నన్ను క్రమశిక్షణతో రూపుదిద్దుతున్న గురువు. యుగ

యుగాల మానవజాతి రూపొందించుకుంటూ వస్తున్న విజ్ఞానంలోకి నడిపించుకు వచ్చే దైవం. అక్క యీ ఆటలో నాకు సహచరి.

....కాని యిదంతా నా ఇప్పటి ఊహ! అప్పటి నా అనుభవాలు వేరు. రెండింటికీ సంబంధమే లేదు! పాతికేళ్ళ క్రింద నేను గ్రహించిందీ, అనుభవించిందీ సత్యమా? లేక అప్పటి నా గురించిన ఇప్పటి ఊహ సత్యమా? అప్పటి నన్ను యీ ఊహతో గుర్తించి యీ అర్థం చెప్పుకోవటం సబబేనా?

అర్థం అనేది చచ్చుమాట. అర్థంలేని మాట!

ఆ కృష్ణుడికీ యీ కృష్ణమూర్తికీ సంబంధం ఏమిటి?

ఆ క్రింద ప్రవహిస్తున్న మహాగంగకీ నేను చూస్తున్న మహా ప్రవాహానికీ సంబంధం ఏమిటి?

నేనక్కడ ప్రవహిస్తున్నానా? ఇక్కడ నుంచీ ప్రవాహాన్ని చూస్తున్నానా?

....చూడగా చూడగా నేనూ ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లనిపించి భయం వేసింది.

నాలో ఏవో ధ్వనులూ, ప్రతిధ్వనులూ, జ్ఞాపకాల నీడలూ....

ఆ జీవన ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఆనాటి నేను నాచుట్టూ విలువల్నీ, సూత్రాల్నీ లైఫ్‌బోట్లుగా అల్లుకోలేదు! నింపాదిగా నిలబడి చుట్టూ పరికించి చూడటానికి అవసరమైన ఆలోచనల వంతెనలు కట్టుకోలేదు! ఉత్త అసహాయుడైన పిల్లవాణ్ణి....ఏదైనా అడ్డం వచ్చినప్పుడు లోనికి మునుగుతూ మళ్ళీ పైకి తేలుతూ ప్రవాహంలో పోతూవున్నాను.

మునగటం. తేలటం. మునగటం.

నాకు ఊహ తెలిసినప్పటినుండి నా ప్రపంచంలో ఒకే ఒక్క మనిషి ఉన్నది – అక్క.

అమ్మ వున్నా ఆమె వేరే మనిషి కాదు. నేనే.

నాన్న వేరే అయినా నా నాన్నే.

అక్క మాత్రం మనిషి.

ఆమె చాల పెద్దది. చాల దుర్మార్గురాలు.

ఒక రోజున నాతో ఏమి చెప్పిందంటే బాగా అన్నం తిని, పాలు తాగి యింకా పెద్దగా అయిపోతానన్నది. నాకు భయం వేసింది. 'ఇంకా పెద్దగా అయిపోతే నాకు యింకా గట్టిగా మొట్టికాయ వేస్తావా ?' అన్నాను సందేహంగా. 'వేస్తాను' అని హుంకరించింది. ఈ అవాంతరం ఎట్లా ఎదుర్కోవాలో నాకు తెలియలేదు. కాసేపు అట్లాగే నిల్చుని ఆవిడకేసి చూశాను. 'ఇంకా మూడు సంవత్సరాలుంటే నేనూ పెద్దవుతాను' అన్నాను బింకంగా. ఆవిడ భయంకరంగా, వికటంగా నవ్వింది. 'అప్పుడు నేనూ యింకా పెద్దయిపోతాను. అప్పుడు నీకు ఎనిమిదేళ్ళుంటాయి. నాకు పద హారేళ్ళుంపై....పదహారు !' అన్నది ఆ మాటను నొక్కి పలుకుతూ, పొంగిపోతూ.

అమ్మ దగ్గరకు పరుగెత్తాను ఉక్రోషంగా.

"అది ముందు పుట్టింది. అందుకని నీకంటే ఎప్పుడూ పెద్దగానే వుంటుంది....అయినా చిన్నగా వుండటమే బాగుంటుంది కదరా, కన్నా" అన్నది అమ్మ. 'ఈ అమ్మకి ఏమీ అర్థంకాదు' అనుకున్నాను నిస్పృహగా. చిన్నవాళ్ళ ఎప్పటికీ చిన్నగా వుండిపోవలసిందేనా ? పెద్దవాళ్ళ

మీద గెలవటానికి మార్గమే లేదా ? అన్యాయం ! 'నువ్వు చిన్న......... నువ్వు చిన్న' అంటూ నా చుట్టూ ఎగురుతుంది అక్క.

అసలు ఈ అక్క ఎందుకు ? దీన్ని ఎక్కడికైనా పంపించేస్తే ఎంత బాగుంటుంది ! అమ్మని అలాగే అడిగాను రెండుసార్లు. అమ్మ సమాధానం చెప్పకుండా నవ్వింది. కొంచెం పట్టుబడితే అక్కని పంపించేస్తుందని నాకు నమ్మకమే. కాని అసలు చిక్కు, నాన్న పెద్ద భూతం లాగా నిల్చుని 'కాదు !' అంటారు. నాన్న మాటకి తిరుగులేదు. పట్టు బట్టి ఒప్పించటాలూ, వాదించటాలూ లేవు. నాన్నంటే నాకు భయం.

అక్క తన డబ్బు లెక్క చూసుకుంటూ "ఒరే కృష్ణా, నాలుగు పావలాలు యిస్తానుగాని రూపాయినోటు యివ్వరా" అన్నది. రూపాయికి నాలుగు పావలాలని నాకు తెలుసు. సూరమ్మ కొట్లో అట్లాగే యిస్తుంది. అందుకని సరేనని నా పర్సు తీసి అక్కకు నా రూపాయి నోటిచ్చి నాలుగు పావలాలు తీసుకున్నాను. అక్కతో సమాన స్థాయిలో వ్యాపారం నడుపగలిగినందుకు నాకు సంతృప్తి, ఆనందం కలిగాయి. కొంచెంసేపు న్నాక అక్కతో యింకా కొంచెం వ్యాపారం చెయ్యాలనిపించింది "అక్కా నాలుగు పావలాలు తీసుకుని, అన్నీ పదిపైస లియ్యి" అన్నాను. అక్క నాలుగు పావలాలు తీసుకుని, పది పదిపైసల బిళ్ళలిచ్చింది. పర్సులో పెట్టుకున్నాను. అప్పుడు అక్క నన్ను చూసి నవ్వుతూ "నాకైతే మంచి కొత్త రూపాయి నోటు" అన్నది. నాకు బలే కోపం వచ్చింది. ఆ మంచి కొత్త రూపాయినోటు అసలు నాది కదా ! నాది నాకిచ్చెయ్యమన్నాను. కాసేపు గొడవ జరిగాక "అయితే నా పది పైసలకాయిన్సు బోలెడన్నీ నాకిచ్చేసెయ్యి. నీనోటు యిచ్చేస్తా" అన్నది. రూపాయి నోటుకి బదు లుగా యిచ్చింది నాలుగు పావలాలు గదా. అవి అప్పుడే తీసుకున్నది. పది పైసల కాయిన్సు నేను ఎందుకివ్వాలి ? నన్ను టక్కరు చేసెయ్యా

లని చూస్తున్నది, పాపం! "అదికాదురా, నావిగదరా ఆ కాయిన్సు. నేను నీకిచ్చాను గదా" అన్నది. "అవి పావలాలిస్తే యిచ్చావు. పావలాలు నీకే యిచ్చానుగా" అన్నాను. అక్క ఒప్పుకోలేదు. ఆవిడ ఎప్పుడూ నా కన్యాయం చెయ్యటమే! అమ్మ దగ్గరికి పరుగెత్తుకెళ్ళాను. అక్కకూడా వెనుకనే పరుగెత్తుతూవచ్చి అమ్మతో ఏమిటేమిటో చెప్పేసింది. 'నా నోటు తీసుకుంది. నా పావలాలు తీసుకుంది. నా కాయిన్సు అన్నీ యివ్వమంటున్నది. నా నోటు నాకిచ్చేసెయ్యమను!" అని అరిచాను కోపంగా. "నీ నోటుకు బదులు పైసలిచ్చాను కదరా. ఆ నోటు నాది" అన్నది అక్క పెద్దగా అరుస్తూ. "అవి పావలాల కిచ్చావు. నోటుకి కాదు. అన్నీ అబద్ధాలు చెప్తున్నావు" అన్నాను. అమ్మ నన్ను ఎత్తుకుని కళ్ళల్లో నీళ్ళు తుడిచి "నీకు నేను వేరే నోటు యిస్తానులే" అన్నది. అక్క నా నోటు తీసుకుందిగదా. దాని సంగతేమిటి? 'నా క్రొత్త నోటే నాకు కావాలి' అని ఏడుస్తున్నాను. నాన్న వచ్చారు. అక్క గబగబా ముందు ముందే ఏమిటేమిటో చెప్పేసింది. ఎప్పుడూ అంతే. పెద్దది గనుక అబద్ధాలన్నీ చెప్పేస్తుంది. నాన్న నన్ను అమ్మ దగ్గర్నుంచి క్రిందకు దింపారు. కుర్చీమీద కూర్చోపెట్టారు. తనూ నా ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు. "విలువ అంటే ఏమిటో నీకు తెలియ లేదు. నేను చెప్తాను. విను. అక్క నీకు రూపాయి విలువ యిచ్చింది. రూపాయి విలువ తీసుకుంది. చెల్లుకు చెల్లు. తెలిసిందా?" అన్నారు నిదానంగా. నాన్నకు సమాధానం చెప్పి లాభం లేదు. ఏమిటేమిటో చెప్తారు. నేను చెప్పేది అర్థం చేసుకోరు. నిస్పృహలో మాట్లాడకుండా ఉండిపోయాను.

ఎప్పుడూ అంతే. పెద్దవాళ్ళు ఏమిటేమిటో చెప్తారు. మేము చెప్పేది అర్థంచేసుకోరు. వాళ్ళు చెప్పినట్లే చెయ్యాలి! .... నాకు స్కూలుకు వెళ్ళాలంటే యిష్టంలేదు. రాకెట్లు తయారు చెయ్యాలనీ,

సూర్యుడి దగ్గర కెళ్ళాలనీ యిష్టం. "స్కూలుకి వెళ్ళి చదువుకుంటే పెద్దయినాక పెద్దరాకెట్లు చేస్తావు. చదువు నేర్చుకోకపోతే రాకెట్లు చెయ్యడం రాదు" అన్నారు నాన్న. నాన్న సంగతి నాకు బాగా తెలుసు. ఇట్లా మెల్లిగా కారణాలు చెప్పి ఒప్పిస్తున్నట్లు మాట్లాడుతారు. నిజంగా వెళ్ళకపోతేమాత్రం ఊరుకోరు!

స్కూలుకు వెళ్తే తిరిగి యింటికి రావటానికి నాకు దోవ తెలియదన్నదే నాకు పెద్ద భయం. స్కూలు ఒదిలే వేళకు జవాను రాముణ్ణి పంపమని అమ్మతో గట్టిగా చెప్పి మనసు కుదుటబరచుకుని వెళ్ళాను.... వెళ్ళకపోతే నాన్న ఊరుకోరుకదా....అక్కలాగా నేనుకూడా అక్కబడికి వెళ్తున్నందుకు కొంత గర్వం కూడా కలిగింది.

....కాని స్కూల్లో వున్నంతసేపూ భయమే – రాముడు రాకపోతే ఎట్లాగా అని. బడి ఒదిలేశారు. అందరూ యిళ్ళకెళ్ళి పోతున్నారు. రాముడు రాలేదు!

ఇహ నాకు యిల్లులేదు .... అమ్మలేదు .... ఎవరూలేరు .... ఏమీలేదు....

పెద్దగా ఏడ్చేశాను. దూరాన అక్క కనిపించింది. పరుగెత్తుతూ వెళ్ళి పరికిణీ పట్టుకున్నాను. అక్క చూసింది. కళ్ళల్లో నీళ్ళు చూసి 'ఎందుకురా ఏడుస్తున్నావూ?' అన్నది. నాకు నోటమాట రాలేదు. 'బళ్ళో ఏడిస్తే పెద్దమేష్టారు కొడతారు' అన్నది. నాకంతా భయంగా, గొడవగా, మసగ్గా వుంది. అక్క నా చెయ్యి గట్టిగా పట్టుకుని 'రా పోదాం' అన్నది. పెద్ద మేష్టారు దగ్గరికి తీసుకెళ్తుందేమోనని 'నేను రాను' అన్నాను. భయమూ, ఏడుపూ కలిసి ఎక్కిళ్ళు బుక్కిళ్ళుగా ఎగదన్నుకు వస్తున్నాయి. అక్క చెయ్యి విడిపించుకోవాలని చూస్తున్నాను.

అంతలో రాముడు వచ్చాడు....అక్కలాగా నేనుకూడా బడికి వెళ్తున్నా నన్న గర్వం, పెద్దరికం పోయాయి. నేను బడిని చూచి భయపడి ఏడ్చే పిరికివాణ్ణి అయిపోయాను....ప్రతి పిల్లవాడిలోనూ ఒక పసివాడూ, పెద్దలతో సమానంగా వ్యవహరించాలనుకునే వ్యక్తీ కూడా వుంటారు. కాని పరిస్థితులు ఎప్పుడూ ఆ లోపలి వ్యక్తిని నలిపేస్తూ, కించపరుస్తూ పిల్లవాణ్ణి పసితనంలోకి విసిరేస్తూ వుంటాయి....

ప్రతిరోజూ నేను అమ్మతోపాటే పెందలాడే లేస్తాను. అమ్మ వంటింట్లో పని చూసుకుంటూ వుంటుంది. అమ్మవున్నా నాకేం లెక్క లేదు. నాన్న, అక్క నిద్రపోతూ వుంటారు. అప్పుడు నా యిష్టారాజ్యం! ధీమాగా యిల్లంతా కలయదిరుగుతూ, పనులు చక్కబెడుతూ నా యిష్టమొచ్చినట్లు చేసుకుంటాను. ఇదేమని అడిగేవాళ్ళుండరు. రోజు మొత్తంలోకీ ఆ సమయంలో భలే హాయిగా వుంటుంది నాకు.

ఆ రోజున అలానే లేచాను. ముందుగదిలోకి వెళ్ళాను. పని మనిషి వస్తుందేమోనని తలుపులు బార్లా తెరిచి పెట్టాను. చలిగాలి వేస్తుందేమోనని తెరిచివున్న కిటికీలు మూసిపెట్టాను. నేను లేచేశానుగదా, ఇహ యిదెందుకని నా దోమతెర విప్పేశాను. నాన్న పెన్నులో సిరాపోసి పెడదామనుకున్నాను. కొంచెం సిరాక్రింద పడిపోయింది. అందుకని ఆ పెన్ను అక్కడే పారేసి అక్క అలమార్లో పుస్తకాలు పూరికే చూద్దామని వెళ్ళాను. అక్క కొత్త బాల్‌పాయింట్‌తో అక్క నోట్సులో మంచి సూర్యుడు, రాకెట్, ప్రపంచం బొమ్మ వేశాను. వెనగ్గదిలో కొచ్చాను. అద్దంముందు అక్క వాచీ కనిపించింది. నాకు వాచీలంటే

భలే యిష్టం. కీ తిప్పవచ్చు! నాకు వాచీలేదు. అక్క వాచీ యిక్కడ పారేసిందేమిటా అనుకుని దాన్ని తీసుకెళ్ళి నా బొమ్మల పెట్టె అడుగున పెట్టాను. బాయిలర్ దగ్గర కెళ్ళాను. క్రింద నిప్పులుండే పళ్ళెం అమ్మ కదిలించినట్లు కదిలిస్తే బాగా మండుతుందని కదిలించబోయాను. అది క్రింద పడిపోయింది. అమ్మ వచ్చి నన్ను లాక్కెళ్ళింది.

బడికి వెళ్ళబోతూ అక్క వాచీకోసం తెగ వెతికింది. కనబడ లేదని అందరితో చెప్పింది. అక్కడ పెట్టిన వాచీ ఎలా పోతుంది? అని అమ్మ, నాన్న, అక్క ఆలోచించారు. గది ఊడ్చినప్పుడు పనిమనిషి జాలమ్మే తీసివుండాలి అనుకున్నారు. జాలమ్మని ఏమని అడగాలి? అడి గితే యిస్తుందా, యివ్వదా? అంటూ రకరకాలుగా అనుకున్నారు. 'అసలు జాలమ్మ యిట్లాంటి పని ఎప్పుడూ చెయ్యలేదు' అన్నది అమ్మ. 'అలమార్లోనూ, మంచాలక్రిందా యింకా జాగ్రత్తగా వెతికి చూడండి' రేపు అడగొచ్చు' అన్నారు నాన్న. భలే తమాషాగా వుంది. నన్నడుగు తారేమో అనుకున్నాను. ఎందుకో వాళ్ళు అడగలేదు. అదెక్కడుందో నాకు తెలుసు కదా. అక్క వాచీ కనపడకుండా పోతే పోనీ! అట్లాగే వెతుక్కోనీ! అనుకున్నాను హాయిగా ఆడుకుంటూ.

అప్పుడు అక్క నాదగ్గరకొచ్చి నన్ను అనుమానంగా చూస్తూ 'ఒరే కృష్ణా, నా వాచీ దొంగిలించావా?' అన్నది. 'లేదు' అని అరి చాను. నాలో కోపం పొంగివచ్చింది. 'నేనేమన్నా దొంగనా? నువ్వె ప్పుడూ నామీదే తప్పు వేస్తావు' అని కోపం పట్టలేక ఏడ్చేశాను. అమ్మ వచ్చింది. 'వాచీ వాడెందుకు తీస్తాడు? ఎక్కడ పెట్టుకున్నావో, ఎవరు తీశారో తెలియకుండా వాడి నంటావేం?' అని కేకలేసింది. నాన్న

మాత్రం అక్క నేమీ అనలేదు. అందుకని నాకు మరింత ఏడుపొచ్చింది. ఆఖరికి నాన్న 'అక్క ఎక్కడ పెట్టిందో.... వెతికితే దొరుకుతుందిలే, నీవు ఏడవొద్దు' అన్నారు. నేను ఏడుపు మానేసి బడికెళ్ళాను.

ఆరోజు సాయంత్రం 'కృష్ణా, నీ బొమ్మలు తీసుకురా. బిల్డింగ్ బ్లాక్స్‌తో కొత్తరకం యిల్లు కడదాం' అన్నది అక్క. పరుగెత్తుకుంటూ వెళ్ళి పెట్టెతెచ్చి అక్కముందు బోర్లించాను. డబడబమంటూ బొమ్మలన్నీ క్రిందికి దూకినై. అన్నిటికంటే ఆఖర్న దిగి అన్నిటిమీద కూర్చుంది నల్లస్ట్రాపుతో చిన్నవాచీ – అక్క వాచీ! అక్క కేకలకి అమ్మా నాన్నా వచ్చారు....వచ్చేశారు!....వాచీ చూశారు! ఏదో పెద్ద తప్పుచేసినట్లు నాకు భయం పట్టుకుంది. గ్రుడ్లప్పగించి చూడ్డంతప్ప నోటమాట రాలేదు.

వాళ్ళు నన్ను పెద్దగా కోప్పడ్డారు. అరిచారు.

నాకు ఏడుపు వచ్చింది కాని ఏడవలేదు.

'నువ్వే తీసి యింత నాటకమాడావా?' అన్నది అమ్మ ఆశ్చర్యంగా.

కోపంవచ్చి అమ్మను కొట్టబోయాను.

'నంగనాచి. చూడు అమ్మమీద తిరగబడుతున్నాడు' అన్నది అక్క.

'భడవా' అంటూ నాన్న నన్ను పట్టుకున్నారు.

అందరి మొహాలూ పరికించి చూశాను. వాళ్ళు నన్ను అర్థం చేసుకోరు! వాచీ నేను దొంగిలించలేదని వాళ్ళకు అర్థం కాదు. వాచీ

నేను తీసుకున్నా కూడా తప్పంతా అక్కడేనని వాళ్ళకు తెలియదు ! నాదే తప్పు అంటారు ! నన్ను వేరుచేస్తారు !

....ఆ పరిస్థితిలో అందరిముందూ దోషిగా నిల్చుని నేను అనుభవించిన నిస్సహాయత, భయం, తప్పు, అప్పుడు నాలో నిండిన నిస్పృహ-అంతా తిరిగి యిప్పుడు అనుభవిస్తున్నట్లు తోచింది....

దీర్ఘంగా నిట్టూర్చాను.

హృదయంనుంచీ మెదడులోకి, నిస్సహాయతనుంచీ అధికారానికి, స్త్రీత్వంనుంచీ పురుషత్వంలోకి, అనుభూతినుంచీ అహంకార వ్యాపారంలోకి పెరగటం మనిషికి తప్పనిసరేమో !

ప్రకృతిధర్మంలో గొంగళీ పురుగులు సీతాకోకచిలుకలుగా మారుతాయి. కాని ఈ మానవ పరిణామంలో సీతాకోకచిలుకలు గొంగళీ పురుగులుగా మారుతాయి !

మనిషికీ మనిషికీ మధ్యన వుండగల వంతెన ఒక్కటే — అది ప్రేమ.

'సిద్ధా, ఎన్నిరా లోకాలు ?'

'ఎవరిలోకం వారిది స్వామీ'

అన్ని లోకాల్నీ కలుపుతూ వంతెనల్ని కట్టెయ్యాలని పెద్ద రాక్షసుడు పథకం వేశాడు. వ్యవస్థలు, విలువలు అంటూ కట్టెలు పట్టుకొచ్చాడు. వాటిని తీసుకుని అందరూ చిన్న సన్నాసుల్ని కొట్టారు. దెబ్బలు మీద పడగానే వాళ్ళూ రాక్షసులైపోయారు. 'నక్సలైట్లు' అని అరిచారు అందరూ కలిసి గోలగోలగా. భూమి దద్దరిల్లేటట్లుగా ధన్‌ధన్‌మని అడుగులేసుకుంటూ బోర విరుచుకుని నడుస్తూ, ఆకాశంకేసి చూసి నిరస

నగా పెదవి విరుపుతో మందహాసంచేసి, నన్ను నేను పరకాయించి చూసుకున్నాను. నా కాళ్ళూ, చేతులూ, తలా అన్నీ కట్టెలతోనే తయారైనై! అన్నీ గట్టి సర్వే కట్టెలే. వాటిని విరిచి పొయ్యిలో పారెయ్యాలనుకున్నాను....

"ఏం, గోదార్లో దూకి చద్దామనుకున్నావా ?" అంటూ రెక్కపట్టుకు గుంజాడు దోవన పోతున్న దానయ్య. వంతెన అంచుమీద నిల్చుని వున్న నేను కళ్ళు మూసుకుని మగతలోకి తూగానేమో....

వెనక్కు జరిగి క్రిందికి చూశాను. మహాగంగ నిండుగా, నింపాదిగా ప్రవహిస్తున్నది. ఆ మందగమనంలో ఎంత చైతన్యం! ఎంత శక్తి! దాన్ని వంతెనమీదినుంచీ చూడొచ్చు. అర్థమూ చేసుకోవచ్చు. కాని దానితో ప్రవహించటం సాధ్యమా ?!

❋❋